# వెంకట రమణకు కరణం నివాళి



**బల్లికురవ, జనవరి 29, ప్రభాతవార్త**
అద్దంకి పట్టణానికి చెందిన నరిశెట్టి వెంకటరమణ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. గురువారం ఆమె దశదిన కర్మ సందర్భంగా చీరాల మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి హాజరై ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన వెంట మాజీ ఎంపీపీ పరిటాల రామయ్య, బొద్దపాటి రవి తదితరులు ఉన్నారు.

## గ్రూపు - 2 ఉద్యోగం సాధించిన ఉపాధ్యాయుడికి సన్మానం



**నాగులుప్పలపాడు, జనవరి 29, ప్రభాతవార్త**
నాగులుప్పలపాడు మండలలోని మద్దిరాలపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న మోతుకూరి రవీంద్రబాబు గ్రూపు-2 పరీక్షా ఫలితాల్లో మున్సిపల్ కమీషనర్‌గా ఎన్నికైన సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమ్మనేని రామారావు అధ్యక్షతన అభినందన కార్యక్రమం జరిగింది. రవీంద్రబాబు చిన్న కుటుంబం నుండి ఎదిగి ఉపాధ్యాయ వృత్తిని చేపట్టారు. అంతటితో ఆగక పోటీ పరీక్షలకు తయారవుతూ తన తోటి వారికి శిక్షణనిస్తూ తాను పోటీపడ్డారు. అప్పటి కృషి ఇప్పటి విజయానికి నాంది అని రామారావు అన్నారు. పాఠశాలలో అన్ని కార్యక్రమాలకు చురుగ్గా పాల్గొంటూ అందరి మన్ననలు పొందారని ముఖ్య అతిధిగా హాజరైన సర్పంచ్ అనురాధ అన్నారు. ఈ సందర్భంగా వైస్ సర్పంచ్ సునీల్‌బాబు, పీవీసీ హైస్కూల్ హెచ్‌ఎం కరిముల్లా సాహెబ్, చేకూరపాడు హైస్కూల్ హెచ్‌ఎం అనిత, నరసింహారావు, రవి, వెంకటేశ్వర్లు, అల్లాబక్షు, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఉపాధ్యాయుడిని అభినందించారు.

## మర్రిపాలెం, పెద్దారికట్లలో పశు ఆరోగ్య శిబిరాలు



**కొనకనమిట్ల, జనవరి 29, ప్రభాతవార్త**
మండలంలోని మర్రిపాలెం, పెద్దారికట్ల గ్రామాలలో గొట్లగట్లు పశువైద్యాధికారిణి వి.రాజ్యలక్ష్మీ ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. డాక్టర్ రాజ్యలక్ష్మీ మాట్లాడుతూ ఈ శిబిరంలో 4239 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాపించడం జరిగిందని, 8 గేదెలకు చూడి పరీక్షలు, 6 గేదెలకు కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు, 87 దూడలకు ఏలికపాముల మందు వేయడం జరిగిందని పేర్కొన్నారు. అనారోగ్యంతో ఉన్న వాటికి మందులు పంపిణీ చేయడం జరిగింది. గొర్రెలలో బొబ్బవ్యాధికి టీకాలు వేస్తమన్నారు. పశుభీమా పథకంను, గేదెలలో లింగ నిర్ధారిత వీర్యం ద్వారా పేయ్య దూడల జననం గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జయరామిరెడ్డి, కోడె గురవయ్య, బాపతీ కృష్ణారెడ్డి, పశు పోషకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్ వరలక్ష్మీ, పశువైద్య సహాయకులు పి.బాబురావు, షేక్ మహబూబ్ భాష, ఉస్టేల రాణి, ఆఫీస్ సబార్డినేట్ కాసు వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

## వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి జైలు నుంచి విడుదల

**- వైసీపీ శ్రేణుల్లో ఉత్సాహం**

**- నిజం నిలిచింది, కూటమి కుట్ర కూలిందంటూ నినాదాలు**

**- బాణసంచాతో మోత మోగిన బస్టాండ్ సెంటర్**



**యర్రగొండపాలెం, జనవరి 29, ప్రభాతవార్త**
ఒంగోలు పార్లమెంటు వైసీపీ అధ్యక్షులు, మొన్న జరిగిన శాసనసభ, పార్లమెంటు ఎన్నికలలో వైసీపీ తరుపున ఒంగోలు పార్లమెంటు ఎన్నికలలో వైసీపీ తరుపున ఒంగోలు పార్లమెంటు అభ్యర్ధిగా తెలుగుదేశం పార్టీ అభ్యర్ధి మాగుంట శ్రీనివాసులురెడ్డి పై తలబడిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అక్రమ మద్యం కేసులో జైలుకు పోయిన విషయం తెలిసిందే. గత కొన్నేళ్లుగా జైలు జీవితం గడిపిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి గురువారం కోర్టు బెయిల్ మంజూరు చేసింది. జైలులో దాదాపుగా 225 రోజులకు పైగా గడిపిన తరువాత ఆయన గురువారం బెయిల్ మంజూరు కావడంతో విడుదల అయి బయటకు వచ్చారు. దాంతో విషయం తెలుసుకున్న యర్రగొండపాలెం మండలం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు యర్రగొండపాలెం పట్టణంలోని వైఎస్సార్ సెంటర్‌లో బాణ సంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ముందుగా వైఎస్సార్‌సీపీ విగ్రహానికి గజమాలను వేసిన శ్రేణులు, అంతే ఉత్సాహంతో బస్టాండ్ సెంటర్‌లో బాణసంచాను కాల్చి ఆనందం వ్యక్తం వ్యక్తం చేశారు. నిజం నిలిచింది, కూటమి కుట్ర కూలిందంటూ నినాదాలను చేశారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్ జిందాబాద్ అంటూ బస్టాండ్ సెంటర్ హోరెత్తించారు. ఈ సందర్భంగా వైసీపీ రాష్ట్ర నాయకులు, భూమిరెడ్డి సుబ్బారెడ్డి, రాష్ట్ర ఎస్టీ విభాగపు నాయకులు రాముల నాయక్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వైసీపీ నాయకుల మీద కక్ష కట్టి వుత్తిత్తి కేసులు పెట్టి జైళ్ళకు పంపుతున్నారని నిజం కాని ఆధారాలు లేని కేసుల వ్యవరాలను న్యాయస్థానాలు తోసిపుచ్చి కూటమి ప్రభుత్వానికి చీవాట్లు పెట్టి మా నాయకులకు బెయిల్ ఇచ్చి బయటకు పంపుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో వైసీపీ శ్రేణులు ఉత్సాహంగా పండుగలు చేసుకున్న ఆ పండుగల్లో కోడిని కోసుకున్న మేకను కోసుకున్న పుట్టిన రోజులకు సంతోష సంబరాలలో కేకులు కోసుకున్న కేసులు పెడుతున్నారని ఇది అన్యాయమని, ధ్వజమెత్తారు. ఈ సంబరాల్లో కేక్ తెప్పించి కేసులు పెడతారని బయబడి పక్కన పెట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 31న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ



**లింగసముద్రం, జనవరి 29, ప్రభాతవార్త**
ఫిబ్రవరి నెల 1వ తేదీన ఆదివారం సెలవును దృష్టిలో ఉంచుకుని ఫిబ్రవరి 1వ తేదీకి బదులుగా ఈ నెల జనవరి 31వ తేదీన ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు లింగసముద్రం మండలంలోని అన్ని గ్రామాల్లో పెన్షన్ లబ్దిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. జనవరి 31వ తేదీన ఏ కారణం చేతనైనా పెన్షన్ తీసుకోలేని లబ్దిదారులకు ఫిబ్రవరి 2వ తేదీన పెన్షన్లు అందజేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. కావున ఈ మార్పును గుర్తించి, డిసెంబర్ 31వ తేదీన సామాజిక భద్రత పెన్షన్ లబ్దిదారులు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని ఎంపీడీవో కే.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు.

## అవార్డు గ్రహీత సుందర్ దయాకర్‌కు ఘన సన్మానం



**త్రిపురాంతకం, జనవరి 29,ప్రభాతావార్త**
స్థానిక మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన సన్మాన సభ కార్యక్రమంలో జూనియర్ సహాయకులుగా పనిచేస్తున్న బచ్చలకూరి సుందర దయాకర్‌ను మండల పరిషత్ అభివృద్ధి అధికారి జిరాజ్ కుమార్‌తో పాటు మిగతాస్టాఫ్ ఘనంగా సన్మానించడం జరిగింది. గణతంత్ర దినోత్సవ సందర్భంగా క్రొత్తగా ఏర్పడిన మార్కాపూర్ జిల్లాలో ఏర్పాటు చేసిన గణతంత్ర వేడుకల్లో జూనియర్ సహాయకులుగా త్రిపురాంతకం మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న సుందర దయాకర్ సేవలను గుర్తించిన ప్రభుత్వం పురస్కార్ అవార్డును జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ సభలో సుందర దయాకర్ ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సుందర దయాకర్ సేవలను మండల పరిషత్ అభివృద్ధి గారితో పాటు పలువురు కొని ఆడారు. ఆయనెక్కడ పనిచేసిన ఉద్యోగమే ఊపిరిగా భావించి బాధ్యతను ఏనాడు విస్మరించకుండా, తన పనిని తాను చేసుకుంటూ వెళ్తారని, ఎవరిని నొప్పించడం బాధించడం ఆయన నైజం కాదని పలువురు ఈ సందర్భంగా దయాకర్ను కొనియాడటం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజ్ కుమార్‌తో పాటు మిగతా సిబ్బంది, మరికొందరు ఉద్యోగస్తులు పాల్గొనడం జరిగింది.

## వినియోగదారుల రక్షణ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలి



**మార్కాపురం, జనవరి 29, ప్రభాతవార్త**
మార్కాపురం జిల్లాకు చెందిన వినియోగదారుల రక్షణ కౌన్సిల్ సభ్యులకు అవకాశంకల్పించకుండా ఇటీవల ప్రకాశం జిల్లా కేంద్రంలో సమావేశం నిర్వహించడంపై వినియోగదారుల సంఘాల ప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. మార్కాపురం జిల్లా కేంద్రంలోనే ప్రత్యేకంగా వినియోగదారుల రక్షణ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ త్వరలోనే మార్కాపురం జిల్లాలోనే వినియోగదారులకు సంబంధించిన సమావేశాలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న భీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**- దోర్నాల యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా మేనేజర్ ఏ.తిరుమల శివప్రసాద్**



**పెద్దదోర్నాల, జనవరి 29, ప్రభాతవార్త**
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన వివిధ భీమా పథకాలను వినియోగించుకోవాలని పెద్దదోర్నాల యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా మేనేజర్ ఏ.తిరుమల శివ ప్రసాద్ పిలుపునిచ్చారు. యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో ఖాతాదారుడుగా ఉన్న మండలంలోని పెద్ద బొమ్మలాపురానికి చెందిన ఉప్పోత్తుల శ్రీను గతంలో యాక్సిడెంట్‌లో మరణించాడు. ఇతనికి దోర్నాల యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో అకౌంట్ ఉంది. ఇతని అకౌంట్‌కు ప్రధానమంత్రి సురక్ష భీమా ఇన్సూరెన్స్ కట్టి ఉన్నాడు. దీంతో భీమా వర్తించి రూ.2లక్షల ఆర్థిక సహాయం చెక్కును బ్యాంకు మేనేజర్ ఏ.తిరుమల శివప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ తిరుమల శివప్రసాద్ మాట్లాడుతూ ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా యోజన, ఆయుష్మాన్ భారత్, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య భీమా వంటి వాటి ద్వారా తక్కువ ప్రీమియంతో అధిక భద్రత వర్తిస్తుందని వివరించారు. ప్రమాదాలు, అనారోగ్యాలు, అకస్మాత్తు మరణాల సమయంలో ఈ భీమా పథకాలు ఆర్థిక భరోసాగా నిలుస్తాయని పేర్కొన్నారు. ముఖ్యంగా పేద, మధ్య తరగతి ప్రజలు ఈ పథకాల్లో చేరడం ద్వారా భవిష్యత్తు ప్రమాదాల నుంచి ఆర్థిక రక్షణ పొందవచ్చునని తెలిపారు. బ్యాంకు ఖాతా కలిగిన ప్రతి ఒక్కరు తమ సమీప బ్యాంకు శాఖను సంప్రదించి భీమా వివరాలు తెలుసుకొని నమోదు చేసుకోవాలని మేనేజర్ కోరారు. భీమా పథకాలపై అవగాహన పెరిగితే సమాజం ఆర్థికంగా మరింత బలపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఈ.తిలకేశ్వర్ గౌడ్, రవికుమార్, వకుల శ్రీ, అప్రైజర్, జి.శ్రీనివాసచారి, తదితరులు పాల్గొన్నారు.

## పెద్దదోర్నాల మండలంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



**పెద్దదోర్నాల, జనవరి 29, ప్రభాతవార్త**
పెద్దదోర్నాల మండలం రామచంద్రకోట, కటకానిపల్లి, చింతల అగ్రహారం, చిన్న దోర్నాల గ్రామాల్లో త్రైత సిద్ధాంతం ప్రబోధ సిద్ధాంతం ఇందు జ్ఞాన వేదిక దొనకొండ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వేమన పద్యాలలో ఇమిడి ఉన్న ఆధ్యాత్మిక జ్ఞానంపై గురువారం ప్రచారం నిర్వహించారు. వేమన పద్యం వెయ్యి విధాల అర్థాలు అమరి ఉండవచ్చు కానీ శోధించి చూస్తే అంత ఆత్మజ్ఞానమే ఉంటుందని తెలిపారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందు జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షులు ఏడుకొండలు, సభ్యులు చెన్నకేశవులు, బాల రంగయ్య, వైష్ణవి, సుబ్బులు, ఆదిలక్ష్మీ, భార్గవి, కొండమ్మ, సీతమ్మ పాల్గొన్నారు.

## మార్కాపురం న్యాయచరిత్రలో కొత్త అధ్యాయం

**- ఏపిపిగా కరణం విజయలక్ష్మి**



**మార్కాపురం, జనవరి 29,ప్రభాతవార్త**
మార్కాపురం 6వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయస్థానానికి అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపిపి)గా కరణం విజయలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ జి విజయ్ కుమార్ గురువారం ఆమెకు అధికారిక ఉత్తర్వులు అందజేశారు. ఈ పదవిలో ఆమె మూడు సంవత్సరాల పాటు కొనసాగనున్నారు. విజయలక్ష్మి 2007వ సంవత్సరంలో జూనియర్ సివిల్ కోర్టు జడ్జిగా ఎంపికయ్యారు. అయితే అనివార్య కారణాల వల్ల న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టలేదు. ప్రస్తుతం మార్కాపురం కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. శతాబ్ద కాలం చరిత్ర కలిగిన మార్కాపురం కోర్టులో తొలిసారిగా ఒక మహిళ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులవడం న్యాయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ నియామకం మహిళా న్యాయవాదులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. విజయలక్ష్మి భర్త కె శ్రీనివాస చౌదరి సీనియర్ న్యాయవాదిగా, గతంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా సేవలందించారు. వీరిద్దరూ ఈ ప్రాంత ప్రజలకు సుపరిచితులు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ తనకు ఏపిపి పదవి లభించడంలో సహకరించిన గౌరవ న్యాయమూర్తులకు, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కు కృతజ్ఞతలు తెలిపారు. ఏపిపిగా నియమితులైన విజయలక్ష్మిని పలువురు న్యాయవాదులు అభినందించారు.

## అండర్ 8 జాతీయ స్థాయిలో 2 వ ర్యాంక్ సాధించిన అన్నా విహారిక



**మార్కాపురం, జనవరి 29,ప్రభాతవార్త**
హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన ఆల్ ఇండియా ఇంటర్ స్కూల్ స్పోర్ట్స్ ఛాంపియన్స్ అండర్ 8 పోటీల్లో మాజీ శాసనసభ్యులు, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇంచార్జి అన్నా రాంబాబు మనుమరాలు, అన్నా కృష్ణచైతన్య కుమార్తె అన్నా విహారిక అద్భుత ప్రతిభతో 2వ ర్యాంక్ సాధించి అందరి ప్రశంసలు అందుకున్నారు. చిన్న వయసులోనే క్రీడలపై ఆసక్తి, క్రమశిక్షణతో కూడిన శిక్షణ ద్వారా ఈ స్థాయిలోవిజయం సాధించడం గర్వకారణమని పలువురు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ చిన్నారి అన్నా విహారికకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

## పరీక్షల వేళ విద్యార్థులకు అండగా ఫ్రెండ్స్ ఫర్ యూ ఫౌండేషన్

**- పెద్దారవీడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష ప్యాడ్స్, పెన్నుల పంపిణీ**



**పెద్దారవీడు, జనవరి 29,ప్రభాతవార్త**
పెద్దారవీడు మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెండ్స్ ఫర్ యూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ మరియు పెన్నుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ కర్ర సుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు. ఇంటర్ మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని-విద్యార్థులకు పరీక్షల సందర్భంగా అవసరమైన సామగ్రిని ఫౌండేషన్ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కర్ర సుబ్బారెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల విద్యాభివృద్ధికి ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొని, ఫ్రెండ్స్ ఫర్ యూ ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాణ్యం భవానీ, అక్కాలా సురేష్‌తో పాటు అధ్యాపకులు చక్కిలం శ్రీధర్,రమణ,సంజీవరావు, గాలెయ్య,వెంకటయ్య,సాలెహా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ



**మార్టూరు, జనవరి 29, ప్రభాతవార్త**
ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సిఫార్సు మేరకు అత్యవసర చికిత్స కొరకు ఎల్‌ఓసీ ద్వారా కారంచేడు మండలం తగ్గుబాడు గ్రామానికి చెందిన ముళ్ళ మున్నీ రూ.83,112 చెక్కును ఎమ్మెల్యే ఆదేశాలతో క్యాంపు కార్యాలయంలో లబ్దిదారులకు చెక్కులను అందజేస్తున్న నాయకులు, క్యాంపు కార్యాలయం ప్రతినిధులు.

## జాతీయ సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

**- జిల్లా సీఐటీయు పిలుపు**



**హనుమంతునిపాడు, జనవరి 29, ప్రభాతవార్త**
ఫిబ్రవరి 12న జాతీయ సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని జిల్లా సీఐటీయు కార్యదర్శి రాయల మాలకొండయ్య పిలుపునిచ్చారు. గురువారం హనుమంతునిపాడు తహసీల్దార్ ఎస్‌కే నాగూల్ మీరాకు వీఆర్‌ఏల డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రం ఇవ్వడం జరిగింది. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు పిలుపు మేరకు దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చిన సందర్భంగా వారు మాట్లాడుతూ వీఆర్‌ఏలకు గత సంవత్సరాల నుండి జీతాలు పెరగలేదని, మన పక్కన ఉన్న తెలంగాణ రాష్ట్రంలో వీఆర్‌ఏలకు పేస్కేల్ జీతాలు అమలు చేస్తున్నారని, మన రాష్ట్రంలో కేవలం 11000 మాత్రమే జీతాలు చెల్లిస్తున్నారని, ఈ జీతంతో కుటుంబాలు గడవక వీఆర్‌ఏలు అప్పులు పాలవుతున్నారని, కూటమి ప్రభుత్వం వచ్చి రాగానే నిబంధనలకు విరుద్ధంగా నైట్ డ్యూటీలు వేశారని, కానీ టీఏ, డీఎల్ కింద ఒక్క పైసా కూడా ఇవ్వలేదని, దశాబ్దాల తరబడి పని చేస్తున్న నామినీలను వీఆర్‌ఏలుగా గుర్తించడం లేదని, వీఆర్వో, అటెండర్, వాచ్మెన్, రికార్డు అసిస్టెంట్, డ్రైవర్ ఖాళీ పోస్టులలో 70శాతం వీఆర్‌ఏలకు కేటాయించాలని, అర్హులైన వారితో ఖాళీలను భర్తీ చేయాలని, డీఏను జీతంతో కలపాలని తదితర డిమాండ్ల పరిష్కారం కోసం ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మెలో వీఆర్‌ఏలు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్స్, మధ్యాహ్న భోజన కార్మికులు, పాఠశాలల ఆయాలు, బిల్డింగ్ వర్కర్స్, ఆటో వర్కర్స్, పంచాయతీ కార్మికులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉద్యోగ కార్మికులు అందరూ మండల కేంద్రంలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏ నాయకులు జ్యోతి, రోశయ్య, పాల్గొన్నారు.

## పెద్దదోర్నాలలో వైభవంగా శివపార్వతుల కళ్యాణ మహోత్సవం





**పెద్దదోర్నాల, జనవరి 29, ప్రభాతవార్త**
శైవ భక్తుల ఆరాధ్య దైవమైన పరమశివుడు - పార్వతి దేవిల కళ్యాణ మహోత్సవం శివ దీక్ష స్వాముల సమక్షంలో చీదెళ్ల సుబ్రహ్మణ్యం, బిందు, కోటేశ్వరరావుల దంపతుల ఆధ్వర్యంలో గురువారం పెద్దదోర్నాల శ్రీ లక్ష్మీ నరసింహాస్వామి దేవాలయం దేవస్థానంలో ఘనంగా నిర్వహించారు. వేద మంత్రోచ్ఛరణల మధ్య శివపార్వతుల కళ్యాణం అత్యంత భక్తి భావంతో జరిగింది. అర్చకులు శాస్త్రోక్త విధానంలో కళ్యాణ తంతు నిర్వహించగా, భక్తులు అక్షింతలు వేసి దైవ దంపతులకు మంగళ ఆశీస్సులు అందించారు. శివపార్వతుల కళ్యాణం సందర్భంగా ఆలయం శివ దీక్ష స్వాముల సందడి భక్తి గీతాలు, శివనామస్మరణతో మార్మోగింది.

## శ్రీప్రేమ సాయి మందిరంలో భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి



**పెద్దదోర్నాల, జనవరి 29, ప్రభాతవార్త**
భీష్మ ఏకాదశి సందర్భంగా విష్ణు సహస్రనామ పారాయణంతో అపారమైన పుణ్యఫలం లభిస్తుందని ఆలయ నిర్వాహకురాలు ప్రసన్న ప్రబోధించారు. దోర్నాల పట్టణంలోని శ్రీ ప్రేమ సాయి మందిరంలో గురువారం భీష్మ ఏకాదశి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విష్ణు సహస్ర నామ పారాయణం భక్తి భావంతో సాగింది. భీష్మ పితామహుడు ఉత్తరాయణంలో భీష్మ ఏకాదశి నాడు శ్రీ మహావిష్ణువును స్తుతించి మోక్షాన్ని పొందిన సందర్భాన్ని ప్రసన్న వివరించారు. విష్ణు సహస్ర నామాలను శ్రద్ధతో పారాయణం చేయడం వలన లేదా వినడం వలన పాప విమోచనం కలిగి ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, కుటుంబ సౌఖ్యము లభిస్తాయని తెలిపారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొని దైవ ఆశీస్సులు పొందారు. ఆలయ నిర్వాహకులు భీష్మ ఏకాదశి కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినందుకు సహకరించిన భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం అనంతరం తీర్థప్రసాదాలు, అన్న ప్రసాద వితరణ జరిగింది.

# 266కే యూరియా విక్రయం చేయాలి

**- అధిక ధరలకు అమ్మితే లైసెన్స్ రద్దు - ఏడిఏ బాలాజీ నాయక్**



**మార్కాపురం, జనవరి 29, ప్రభాతవార్త**
మార్కాపురం ఏడిఏ (అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్) బాలాజీ నాయక్ అధ్యక్షతన గురువారం మార్కాపురం, తల్లుపాడు మండలాలకు చెందిన ఎరువుల డీలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియాను ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.266 కంటే ఒక్క రూపాయి ఎక్కువగా కూడా అమ్మకూడదని స్పష్టంగా హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు యూరియా విక్రయించిన డీలర్లపై కఠిన చర్యలు తీసుకొని, లైసెన్సు రద్దు చేయడం జరుగుతుందని తెలిపారు. అదే విధంగా, మార్కాపురం మండల వ్యవసాయ అధికారి కే బుజ్జి బాయి ఆధ్వర్యంలో మార్కాపురం పట్టణంలో ఉన్న ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి, రైతులకు యూరియాను రూ.266 ప్రభుత్వ ధరకు అందజేశారు. ఎక్కడైనా అక్రమ నిల్వలు, అధిక ధరలు ఉన్నట్లయితే వెంటనే చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం ఏడిఏ బాలాజీ నాయక్, మండల వ్యవసాయ అధికారులు ఎన్ లక్ష్మీనారాయణ, జోష్న దేవి, బుజ్జి బాయి, సంబంధిత ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

## మీరు ధరించే హెల్మెటే మీకు రక్షణ కవచం - ఎస్సై నాగరాజు



**కొమరోలు, జనవరి 29, ప్రభాతవార్త**
మీరు ధరించే హెల్మెట్ మీకు రక్షణ కవచంలా మారుతుందని కొమరోలు ఎస్సై జె నాగరాజు వాహనదారులతో అన్నారు. గురువారం మండలంలోని అమరావతి, కడప రాష్ట్రీయ రహదారిపై వాహనదారులకు ఎస్ఐ నాగరాజు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ లేకపోతే రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు అత్యధికంగా ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని అంతేకాకుండా అంగవైకల్యం కూడా పొందుతారని వాహనదారులకు తెలిపారు. ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తితోపాటు వెనక కూర్చున్న వ్యక్తి కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనంపై ప్రయాణించాలని దానివల్ల సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరవచ్చని ఎస్సై తెలిపారు. హెల్మెట్ ధరించకుండా నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే జరిమానాలు విధిస్తామని వాహనదారులను నాగరాజు హెచ్చరించారు.

## ఫేక్ పార్సిల్స్, కాల్స్‌తో అప్రమత్తం - ఎస్సై నాగరాజు



**కొమరోలు, జనవరి 29, ప్రభాతవార్త**
సైబర్ నేరగాళ్లు చేసే ఫేక్ ఫోన్ కాల్స్‌తో పాటు ఫేక్ పార్సిల్స్ తో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొమరోలు ఎస్సై నాగరాజు అన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంక్ అధికారులమని మీ బ్యాంకుకు సంబంధించిన వివరాలు లేదా ఓటీపీ వివరాలు అడుగుతారని, అలా వచ్చిన కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసు సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. బ్యాంక్ అధికారులు ఎవరు ఫోన్ ద్వారా సంప్రదించి మీ వివరాలు అడగరని తెలిపారు. ఇక మహిళలు వేధింపులకు గురవుతున్నట్లయితే వెంటనే పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. అలా ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచి వేధింపులకు గురి చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు సిబ్బంది తెలిపారు. ఇక మీకు బహుమతి గెలుచుకున్నారని మీకు పాలన సంస్థ బహుమతులు పంపిందని ఫేక్ పార్సెల్ వస్తుంటాయని దానికి కొంత నగదు చెల్లించాల్సి ఉంటుందని మోసాలు జరుగుతున్నాయని ఇటువంటి వాటిని నమ్మి మోసపోవద్దని పోలీసులు ప్రజలను హెచ్చరించారు.

## ఒక రోజు ముందు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ



**వలేటివారిపాలెం, జనవరి 29, ప్రభాతవార్త**
ఫిబ్రవరి నెల 1వ తేదీన ఆదివారం కాబట్టి సెలవును దృష్టిలో ఉంచుకుని ఫిబ్రవరి 1వ తేదీకి బదులుగా ఈనెల జనవరి 31వ తేదీనే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు వలేటివారిపాలెం మండలంలోని అన్ని గ్రామాల్లో పెన్షన్ లబ్దిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. జనవరి 31వ తేదీన ఏ కారణం చేతనైనా పెన్షన్ తీసుకోలేని లబ్దిదారులకు ఫిబ్రవరి 2వ తేదీన పెన్షన్లు అందజేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. కావున ఈ మార్పును గుర్తించి, డిసెంబర్ 31వ తేదీన సామాజిక భద్రత పెన్షన్ లబ్దిదారులు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, ఎంపీడీవో వై.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

# పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

**- ఎంపీడీవో ఈశ్వరమ్మ**



**కొనకనమిట్ల, జనవరి 29, ప్రభాతవార్త**
పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి డి.ఈశ్వరమ్మ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని వాగుమడుగు గ్రామ పంచాయతీలో తనిఖీలు నిర్వహించారు. ఇంటి పన్ను వసూళ్ల వేగవంతం చేయాలన్నారు. పారిశుధ్య పనులు, ఐవీఆర్ఎస్ కాల్స్, పెన్షన్, స్వామిత్వ, అభివృద్ధి పనులపై చర్చించారు. వాగుమడుగులోని డీప్ బోర్ వెల్‌ని పరిశీలించారు. యుపీఎస్ సర్వే త్వరగా పూర్తి చేయాలని, స్వర్ణ పంచాయతీ పోర్టల్ నందు గత సంవత్సర ఇంటి పన్ను బకాయి, ప్రస్తుత సంవత్సర ఇంటి పన్ను బకాయిలు ఆప్షన్ చెల్లించు విధంగా సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అభివృద్ధి అధికారి ఏ.శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 1న అమరవీరుల స్థూపం ఆవిష్కరణ

**రాచర్ల, జనవరి 29 ప్రభాతవార్త**
మండలంలోని ఆకవీడు గ్రామంలో సైనికులు, మాజీ సైనికులు సంయుక్తంగా కలిసి ప్రతిష్టాత్మకంగా నిర్మించిన అమరవీరుల స్థూపావిష్కరణ ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం ఉదయం 10:30 గంటలకు జరుగుతుందని స్థూప నిర్మాణ కమిటీ సభ్యులు ప్రభుదాస్,రామకృష్ణ, ఆంజనేయులు, రామకృష్ణారెడ్డిలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థూపం ఆవిష్కరణకు మార్కాపురం జిల్లా ఉన్నతాధికారులతో పాటు గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి కూడా హాజరవుతారని వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి సైనికులు, మాజీ సైనికులు, పారా మిలటరీ దళాల సభ్యులు, గ్రామ మరియు పరిసర గ్రామాల ప్రజలు పాల్గొని కార్యక్రమం విజయవంతానికి అందరూ సహకరించాలని వారు కోరారు.

# నేతన్నల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

**- నేతన్నలకు కూటమి ప్రభుత్వ శుభవార్త**

**- ఏప్రిల్ 1 నుంచి చేనేతలకు ఉచిత విద్యుత్**

**- నాలుగు లక్షల కుటుంబాలకు లబ్ది - ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు**

**మార్టూరు, జనవరి 29, ప్రభాతవార్త**



రాష్ట్రంలో చేనేత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న నేతన్నల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. చేనేత రంగాన్ని ఆదుకునే దిశగా ఏప్రిల్ 1నుంచి మగ్గాలకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పథకం కింద హ్యాండ్లూమ్(చేనేత మగ్గం)లకు నెలకు 200 యూనిట్లు, పవర్ లూమ్(మర మగ్గాలు)లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించనున్నారు. ఈ నిర్ణయంతో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 4లక్షల మంది నేతన్నల కుటుంబాలకు ప్రత్యక్షంగా లబ్ది చేకూరనుందన్నారు. విద్యుత్ ఛార్జీలు భారంగా మారడంతో గత కొన్నేళ్లుగా చేనేత రంగం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొందని ఎమ్మెల్యే ఏలూరి అన్నారు. ఆ పరిస్థితిని మార్చి , నేతన్నలకు ఆర్థిక భరోసా కల్పించేందుకే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ పథకం అమలుతో ప్రభుత్వంపై ఏడాదికి సుమారు రూ.85 కోట్ల మేర ఆర్థిక భారం పడినా, నేతన్నల భవిష్యత్తు దృష్ట్యా ఆ భారాన్ని భరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అదే విధంగా నేతన్నలకు సామాజిక భద్రత కల్పించే దిశగా 50 ఏళ్ల వయసు నుంచే నెలకు రూ.4వేల పెన్షన్ అందిస్తున్నామని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి చేనేత కార్మికుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్న కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నేతన్నల జీవితాల్లో ఆశాభావం నింపేలా తీసుకున్న ఈ నిర్ణయం చేనేత రంగానికి నూతన ఉత్సాహం తీసుకువస్తుందని అన్నారు. రానున్న రోజుల్లో కూడా చేనేత రంగ అభివృద్ధి, నేతన్నల సంక్షేమం కోసం ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపట్టనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

## శానిటేషన్, సర్వేలు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎంపీడీవో సురేష్‌బాబు

**సంతనూతలపాడు, జనవరి 29, ప్రభాతవార్త**



జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశాల మేరకు సంతనూతలపాడుమండలం తక్కెళ్ళపాడు గ్రామంలో గురువారం నాడు ఎంపీడీవో డి.సురేష్‌బాబు ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్నిసందర్శించి వర్మీ ప్రిపరేషన్, డోర్ టు డోర్ గార్బేజ్ కలెక్షన్‌ను పరిశీలించారు. గ్రామాల పరిశుభ్రతకు అందరూ పాటుపడాలన్నారు. అనంతరం తక్కెళ్ళపాడు గ్రామంలో యుపీఎస్ సర్వేను ఎంపీడీవో డి.సురేష్‌బాబు పరిశీలించారు. అక్షరాంధ్రకు సంబంధించి ఫోగ్రెస్‌ను సచివాలయ సిబ్బందితో ఆయన సమీక్షించారు. గ్రామంలో జల జీవన్ మిషన్‌కు సంబంధించి పనులను ఆయన పరిశీలించారు. పారిశుధ్య పనులతో పాటు తాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంపీడీవో సురేష్‌బాబు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మొదట సంతనూతలపాడులోని ఎస్టీ కాలనీ సమీపంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంపీడీవో సురేష్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రతగా ఉంచుకోవాలని, ఎంపీడీవో సురేష్ బాబు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తక్కెళ్ళపాడు పంచాయతీ అభివృద్ధి అధికారి కే.ఈశ్వర్‌రెడ్డి, సచివాలయం సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ట్రిబుల్ ఐటీ కళాశాలను ఒంగోలులోనే కొనసాగించాలని

## జేఏసీ పర్యవేక్షణలో ట్రిబుల్ ఐటీ విద్యార్థులచే ఆందోళన

**సంతనూతలపాడు, జనవరి 29, ప్రభాతవార్త**



ట్రిబుల్ ఐటీ కళాశాలను ఒంగోలులోనే కొనసాగించాలని ఫ్లోరిన్ ప్రాంతమైన కనిగిరిలో వద్దని సంతనూతలపాడు మండలం ఎండ్లూరు డొంక వద్దనున్న ట్రిబుల్ ఐటీ కళాశాల పూర్వ ఎస్ఎస్ఎన్ ఇంజనీరింగ్) విద్యార్థులు తరగతులు బహిష్కరించి గురువారం ఆందోళన, ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ విద్యార్థి యువజన జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు రాయిపాటి జగదీష్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ తమ ట్రిబుల్ ఐటీ కళాశాలను ఫ్లోరైడ్ ప్రాంతమైన కనిగిరి ప్రాంతానికి తరలించడాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో తరగతులను బహిష్కరించి కళాశాల లోపల, కళాశాల బయట ఒంగోలు, కర్నూలు రోడ్డు ఆవరణ ప్రాంతంలో ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన ఒంగోలు క్యాంపస్‌కి అన్ని వసతులు ఉన్నాయని అన్నారు. జిల్లా కేంద్రానికి సుదూర ప్రాంతమైన కనిగిరి ప్రాంతానికి తరలించడానికి వారు తీవ్రంగా వ్యతిరేకించారు. కనిగిరి ప్రాంతం ఫ్లోరైడ్ ప్రాంతం అని అన్ని వసతులు ఉన్న ఒంగోలును కాదని ఫ్లోరైడ్ ప్రాంతానికి తరలించడం వలన తమ తల్లిదండ్రులు మా కొరకు రావాలంటే పలు ఇబ్బందులు పడతారన్నారు. ఇక్కడకు అన్ని ప్రయాణ సౌకర్యాలు ఉన్నాయని వారు తెలిపారు. గత పది సంవత్సరాలుగా నిర్వహిస్తున్న కళాశాలను కనిగిరి ప్రాంతం ఫ్లోరైడ్ ప్రాంతమైన కనిగిరికి తరలించడం సరైంది కాదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కనిగిరి ప్రాంతం ఫ్లోరైడ్ ప్రాంతం, అటవీ ప్రాంతమని అక్కడున్న ప్రజలు ఫ్లోరైడ్‌తో బాధపడుతున్నారని మమ్మల్ని కూడా అక్కడకు పంపితే ఫ్లోరైడ్ సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని వారు తమ తమ ఆవేదనను వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రఆనికి కూత వేటు దూరంలో ఉన్న ఈ కళాశాల విద్యార్థులకు ప్లేస్మెంట్ కూడా భాగా వస్తున్నాయని వారు తెలిపారు. ఒంగోలులోనే ట్రిబుల్ ఐటీని కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు.

**ట్రిబుల్ ఐటీని ఒంగోలులోనే కొనసాగించండి :**

**విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు రాయపాటి జగదీష్**



ట్రిబుల్ ఐటీ కళాశాలను ఒంగోలులోనే కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ విద్యార్థి యువజన జేఏసీఅధ్యక్షులు రాయపాటి జగదీష్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. విద్యార్థులు చేస్తున్న ఆందోళన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గత ఎన్నికల ముందు నేటి మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఒంగోలులోని ట్రిబుల్ ఐటీ కళాశాలను ఉంచుతామని విద్యార్థులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆయన పేర్కొన్నారు. లేనిచో ఆందోళనను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని జగదీష్ హెచ్చరించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు నల్లబ్యాడ్జీలు ధరించి తరగతులను బహిష్కరించి ఈ ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. గత రెండు రోజుల నుండి విద్యార్థులు ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.

# ఒంగోలులోనే ట్రిబుల్ ఐటీ కళాశాలను కొనసాగించాలని

## అధ్యాపకులు విద్యార్థుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు వినతి

**సంతనూతలపాడు, జనవరి 29, ప్రభాతవార్త**



ఒంగోలులోనే ట్రిబుల్ ఐటీ కళాశాలను కొనసాగించాలని కోరుతూ గురువారం సాయంత్రం ఒంగోలులోని సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్‌కుమార్ కార్యాలయంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, జేఏసీ నేతలు, ఎమ్మెల్యే విజయ్ కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఫ్లోరైడ్ ప్రాంతమైన కనిగిరిలో ఏర్పాటు చేసి తమను ఇబ్బందులు పెట్టవద్దని ఒంగోలులోనే ట్రిబుల్ ఐటీ కళాశాలను ఉంచాలని వారు ఎమ్మెల్యే విజయ్ కుమార్‌ను కోరారు. సంతనూతలపాడు మండలం ఎండ్లూరుడొంక వద్ద గల ఆర్జేయూకేటీ కళాశాల అధ్యాపకులు విద్యార్థినీ, విద్యార్థులు, ఈ సందర్భంగా సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్‌ను మాకుమ్మడిగా కలిసి విన్నవించారు.

# రెవెన్యూ శాఖ నూతన విధానాలపై తహసీల్దార్ నారాయణరెడ్డి సిబ్బందితో సమీక్ష

**సంతనూతలపాడు, జనవరి 29, ప్రభాతవార్త**



రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమల్లోకి తీసుకువచ్చిన రెవెన్యూశాఖ విధానాలపై సంతనూతలపాడు తహసీల్దార్ ఎస్ఎల్ నారాయణరెడ్డి రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేకంగా సమీక్షించారు. గురువారం సాయంత్రం సంతనూతలపాడు రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బందితో తహసీల్దార్ నారాయణరెడ్డి ఈ సందర్భంగా సమీక్ష చేపట్టారు. రెవెన్యూ నూతన విధానాలపై ఆయన వివరించారు. రీ సర్వే జరిగిన గ్రామాల్లో జాయిర్ ఎల్పీఎంలు, ఫోటో కరెక్షన్స్, కోరిలేషన్ ప్రాబ్లమ్స్‌ను సవరించాలన్నారు. గ్రామాల్లో ఇతరుల భూముకు సంబంధించి హక్కు దారులను గుర్తించి వారికి ఆర్వోఆర్ చట్ట ప్రకారం ఆన్‌లైన్ నమోదుపై తహసీల్దార్ నారాయణరెడ్డి వివరించారు. డెలీగేషన్ ఆఫ్ పవర్ గతంలో జాయింట్ కలెక్టర్ల ఆధీనంలో ఉండేది ప్రభుత్వం కొత్తగా దీనిని రైతులకు మేలు చేసేందుకు గాను మండలాల తహసీల్దార్లకు అధికారులు ఇచ్చారు. దీనిపై తహసీల్దార్ నారాయణరెడ్డి ప్రత్యేకంగా వీరికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎస్.మాబు సుభాని, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పీవీ రామ తేజ్, మండల సర్వేయర్ ఎం.రాజేష్, మండలంలోని వీఆర్వోలు, గ్రామాల సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## వెంకటేశ్వర స్వామి భక్తులకు కూటమి ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలి

**- మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు డిమాండ్**

**మార్కాపురం టౌన్, జనవరి 29, ప్రభాతవార్త**



తిరుమల తిరుపతి దేవస్థానం వారు లడ్డూ తయారీలో వాడిన నెయ్యిలో జంతువుల కలేబరాల కొవ్వు ద్వారా తీసిన నూనెను ఉపయోగించారని కూటమి ప్రభుత్వం చేసిన ఆరోపణలను పరిగణలోకి తీసుకుని సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు దర్యాప్తు చేసిన సిబిఐ జంతు కలేబరాల కొవ్వు ద్వారా తీసిన నూనెను లడ్డూ తయారీకి వాడిన నెయ్యిలో ఉపయోగించలేదని నివేదికను సుప్రీం కోర్టుకు ఇచ్చినట్లు మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం రాజకీయ దురుద్దేశ్యంతో ప్రత్యక్షంగా జగన్ మోహన్‌రెడ్డిని ఎదుర్కొనలేక పరోక్షంగా దెబ్బతీసేందుకే కూటమి ప్రభుత్వం కల్తీ జరిగినట్లు ఆరోపించడం భక్తుల మనోభావాలను దెబ్బతీయడమేనని ధ్వజమెత్తారు. ప్రపంచ వ్యాప్తంగా వున్న వెంకటేశ్వర స్వామి భక్తుల మనోభావాలను గౌరవించి ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కూటమి ప్రభుత్వం వెంకటేశ్వర స్వామి భక్తులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

# చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి బెయిల్ మంజూరుపై హర్షం

**- వైసీపీ మైనారిటీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మోహిద్దీన్**

**మార్కాపురం టౌన్, జనవరి 29, ప్రభాతవార్త**



అక్రమ మద్యం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటూ అరెస్టు అయిన వైసిపి కీలక నాయకుడు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి జైలు నుండి బెయిల్‌పై విడుదల కావడం పట్ల వైసిపి మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మోహిద్దీన్ గరువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. వైసీపీ నాయకులను మరియు కార్యకర్తలను కూటమి నేతలు ఇబ్బందులకు గురి చేయడం సబబు కాదన్నారు. ఇటువంటి సంస్కృతిని కూటమి ప్రభుత్వం విడనాడాలని సయ్యద్ గౌస్ మోహిద్దీన్ అభిలాషించారు. ఏ తప్పు చేయని, పార్టీలో కీలకంగా ఉన్న చెవిరెడ్డి లాంటి వారిపై ఇటువంటి కేసులు బనాయించడం వల్ల వారికి ప్రజా మద్దతు పెరగడమే తప్ప తగ్గదని సూచించారు.

# ఘనంగా సుధాకరరావు వర్ధంతి

**- మున్సిపల్ వర్కర్స్‌కి బట్టలు పంపిణీ**





**అద్దంకి ,జనవరి 29, ప్రభాతవార్త**

పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్లోని 12 వార్డ్‌లో చిన్ని శాంతయ్య మనవడు సుధాకర్ రావు మొదటి వర్ధంతి సందర్భంగా సుధాకర్ రావు, సతీమణి లక్ష్మీ తులసమ్మ, వారి కుమారులు చిన్ని శ్రీహరి రావు, వారి కుటుంబం సమేతంగా అద్దంకి మున్సిపాలిటీ లో పనిచేస్తున్న స్వీపర్స్, వర్కర్స్ 120 మందికి బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని లక్ష్మీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.





## నిరాధార విమర్శలు చేస్తే ఎంతమాత్రం సహించేదిలేదు -ఎమ్మెల్యే

**- కందుకూరు అభివృద్ధి, అవినీతిపై చర్చకు సిద్ధమా !**

**- ఇంటిమీదకు వస్తానంటావా... వచ్చిచూడు ..తెలుస్తుంది**

**- మీడియా సమావేశంలో బుర్రాపై నిప్పులు చెరిగిన ఎమ్మెల్యే**

**కందుకూరు జనవరి 30 ప్రభాతవార్త**



వైసీపీ పాలన అంతా అవినీతిఅక్రమాలేనని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఇటీవల వైసీపీ కందుకూరు ఇన్‌చార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్ ఆరోపణలపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. నిరాదార విమర్శలు చేస్తే ఇక ఏమాత్రం సహించేదిలేదన్నారు. తన ఇంటిమీదకు వస్తానంటావా..వచ్చి చూడు తెలుస్తుందన్నారు. ఎమ్మెల్యేగా రియల్ వ్యాపారిగా చేసిన ఘనకార్యాలన్నీ తనవద్ద ఉన్నాయన్నారు. కబ్జాదారులును పక్కనపెట్టుకొని తనపైనే విమర్శలు చేస్తావా అని ప్రశ్నించారు. అవినీతి అభివృద్ధిపై బహిరంగచర్చకు రావాలని సవాల్ విసిరారు. పెదపవనిలో జెడ్పీటీసీ నళినిపద్మకు సంబందించిన భూవివాదంపై వివరణ ఇచ్చారు. సర్వేనంబరు 863/1లోని కోట్ల విలువైన వివాదాస్పద భూమిని కబ్జాచేసెందుకు జెడ్పీటీసీ ప్రయత్నిస్తే ప్రభుత్వం ఆ ప్రయత్నాలను అడ్డుకుందన్నారు. అదేవిధంగా పెదపవనిలో పీర్లచావిడి స్థలాన్ని సైతం నకిలీపొజిషన్ ధృవపత్రంతో జడ్పిటిసి ఆక్రమించేందుకు ప్రయత్నించగా ముస్లింలు అడ్డుకున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ముస్లింలకు అండగా నిలిచానని తనపై కక్షగట్టారన్నారు. ఈ నేపద్యంలో తనపై ఆరోపణలు చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో మాజీ ఎంపీటీసీలు, మాజీ జడ్పిటిసిలు, మండలస్థాయి నాయకులు జగనన్న లేఅవుట్ల పేరుతో భూమిని రెండు మూడురెట్లకు అమ్మి జేబులు నింపుకున్నారని అన్నారు. ఓ నియోజకవర్గస్థాయి నేత అక్రమ ఇసుకరవాణాను వైసీపీ ఎమ్మెల్సే అడ్డుకోవడం వైసీపీ మీడియనే బయటపెట్టిందన్నారు .మద్యం, ఇసుకలో ఏ రేంజ్‌లో దోచుకున్నారో ఆధారాలన్నీ తమ దగ్గర ఉన్నాయని ఎమ్మెల్యే అన్నారు. రాబోయే మూడేళ్లలో ప్రజలకు మేలు చేసి, వారి ఆశీర్వాద బలంతో 2029 ఎన్నికల్లో మరోసారి గెలిచి చూపిస్తానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు.

**ఇంటికి వస్తావా...వచ్చిచూడు !**

ఇన్‌చార్జ్ బుర్రాపై మండిపడ్డారు. తన ఇల్లు, ఆఫీసు ముట్టడిస్తానని బుర్రా ప్రగల్భాలు పలుకుతున్నాడన్నారు. ఒకసారి వచ్చి చూస్తే ఏం జరుగుతుందో తెలుస్తుందని ఎమ్మెల్యే నాగేశ్వరరావు అన్నారు. కనిగిరి ఎమ్మెల్యేగా కక్కుర్తితో బ్లీచింగ్ పౌడర్ అమ్ముకున్నారని ఆరోపించారు. కనిగిరిలో జడ్పిటిసిలకు డబ్బులు ఎగ్గొట్టారని, హైదరాబాద్ మణికొండలో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో చేసిన అక్రమదందాలు తనకు తెలుసన్నారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లింగసముద్రం మండల పార్టీ అధ్యక్షులు పూరిమెట్ల గురునాథం, పార్టీ నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు చిలకపాటి మధుబాబు చదలవాడ కొండయ్య, రాయపాటి శ్రీనివాసరావు, బెజవాడ ప్రసాద్ పాల్గొన్నారు

# డ్రగ్స్ వినియోగిస్తే తీవ్ర పరిణామాలు

**- డిపోలో అవగాహన సదస్సు**

**కందుకూరు జనవరి 30, ప్రభాతవార్త**



గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని కందుకూరు సీఐ అన్వర్‌బాషా తెలిపారు. డ్రగ్స్ వినియోగిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని ఆయన తెలిపారు. గురువారం పట్టణంలోని ఆర్టీసీ డిపో ప్రాంగణంలో పట్టణ ఎస్సై పి.నాగరాజు అధ్యక్షతన మత్తుపదార్థాల వినియోగం వలన కలిగే కష్టనష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్జీవోల ఆధ్వర్యంలో డీఅడిక్షన్ కేంద్రాల నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డ్రగ్స్ పై విద్యార్థుల్లో అవగాహన కలిగించేలా కేజీ నుంచి పీజీ వరకు డ్రగ్‌ఫ్రీ ఏపీ కరిక్యులమ్ అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. గంజాయితోపాటు మత్తుపదార్థాలనువినియోగించినా ఉత్పత్తిచేసినా, ఆర్థికంగా, శారీరకంగా మానిసంగా ప్రోత్సహించినా, సహకరించినా చట్టరీత్యా నేరస్తులేనని ఆయన వివరించారు. ఇందుకు సంబందిత వ్యక్తులంతా శిక్షార్హులేనన్నారు. మత్తుపదార్థాల ఆచూకి తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. సదరు వ్యక్తులకు నగదు బహుమతితో సత్కరిస్తామన్నారు. సమాజశ్రేయస్సు దృష్ట్యా ప్రతి ఒక్కరూ గంజాయి వాడకంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం డ్రగ్స్ వినియోగించమని ప్రయాణికులుచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ఆర్ శ్రీనివాసరావుతోపాటు పలువురు ప్రయాణికులు ఉన్నారు.

# 31నే పింఛన్ల పంపిణీ

**తాళ్లూరు, జనవరి 29,ప్రభాతవార్త**

ఫిబ్రవరి నెల ఒకటో తేదీ ఆదివారం వచ్చినందున జనవరి 31నే పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ పీ. అజిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 6135 పింఛన్లను ఒకేరోజు సిబ్బందితో పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పింఛన్ల పంపిణీని ఒక రోజు ముందే చేపట్టనున్నట్లు ఆమె వెల్లడించారు.

# సిసి కాలువ పనులను పరిశీలించిన ఎంపిడివో

**పొన్నలూరు, జనవరి 29, ప్రభాతవార్త**



మండలంలోని ఉప్పలదిన్నె పంచాయతీలో పీఎంజెఎవై పథకం కింద జరుగుతున్న సిసి కాలువల పనులను ఎంపిడివో పి.సుజాత గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీలో జరుగుతున్న సీసీ కాలువల పనిలో జరుగుతున్న ఆలస్యానికి గల కారణాలను ఇంజనీరింగ్ అసిస్టెంట్, పీడీఓలను అడిగి తెలుసు కున్నారు. అదేవిధంగా పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వెంకటరావు, కాంట్రాక్టర్ మాల్యాద్రి, పీడీఓ అబ్దుల్ బారి, శ్రీకాంత్, హరీష్, మోబీన పాల్గొన్నారు.

## సామజిక చైతన్యం కోసమే ఎన్. యస్. యస్ పాటుపడాలి

**- వి. సి ప్రొఫెసర్ డి వి ఆర్ మూర్తి**

**ఒంగోలు ,జనవరి 29, ప్రభాతవార్త**



ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం యన్. యస్. యస్ కోఆర్డినేటర్ డాక్టర్ మండే హర్ష ప్రీతం దేవ్ కుమార్ ను విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ డి వి ఆర్ మూర్తి అభిన అందించారు. ప్రకాశం జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్ పి రాజబాబు చేతుల మీదుగా ఉత్తమ్ విశ్వవిద్యాలయం యన్. యస్. యస్ కోఆర్డినేటర్ హర్ష ప్రీతమ్ దేవ్ కుమార్ ను ప్రశంసిస్తూ జనుఅరీ 26 గణతంత్ర దినోత్సవం సందర్భంగా మెరిట్ ఔట్స్టాండింగ్ సర్టిఫికెట్ ను బహుకరించారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని విశ్వవిద్యాలయం యన్. యస్. యస్ కోఆర్డినేటర్ డాక్టర్ మండే హర్ష ప్రీతం దేవ్ కుమార్ ను విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ డి వి ఆర్ మూర్తి అభినందనలు తెలియజేసి ఆయన మాట్లాడుతూ ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయంలో యన్. యస్. యస్ వాలంటీర్లు మరియు అనుబంధ కళాశాలల యన్. యస్. యస్ యూనిట్స్ 5800 వాలంటీర్స్ జిల్లా వ్యాప్తంగా లీటరసీ ప్రోగ్రామ్స్, ఎన్విరాన్మెంట్ డెవలప్మెంట్ హెల్త్ క్యాంప్స్, బ్లడ్ డొనేషన్ డ్రగ్ అబ్యూస్ అవేర్నెస్, చైల్డ్ మరియు విమెన్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్స్, నేషన్ ఇంటెగ్రేషన్ కమ్యూనల్ హార్మోనీ తూఫాన్ హెవీ రైన్ భూకంపాలు, సునామి మొదలగు ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినపుడు జాతీయ సేవా పథకం వాలంటీర్స్ ముందు ఉండి ప్రజలకు సేవ్ చాస్తున్నారని అలాగే ప్లాస్టిక్ నివారణ ఐ డొనేషన్, ట్రీ ప్లాంటేషన్ వాహన భద్రతా స్కిల్ డెవలప్మెంట్ మొదలగు అంశాలలలో యన్. యస్. యస్ పాత్ర గణనీయమైనదని అలాగే వీటన్నింటిని కోఆర్డినేట్ చేస్తున డాక్టర్ మండే హర్ష ప్రీతం ను వ్యక్తిగతంగా అభినందిస్తూ ఈ కార్యక్రమ నిర్వహణ వల్ల సామజిక చైతన్యం మరియు సామజిక వికాసానికి నేషనల్ సర్వీస్ స్కీం పథకాలు పరోక్షంగా ప్రత్యక్షంగా సమాజానికి ఉపయోగపడతాయని ప్రొ డి వి ఆర్ మూర్తి పేర్కొన్నారు.

# మలినేని కళాశాలలో ఉద్యోగాల మేళా

**సింగరాయకొండ, జనవరి 29,ప్రభాతవార్త**



మండలం లోని కనుమళ్ల గ్రామంలోని మలినేని సుశీలమ్మ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం క్యూ స్పైడర్స్ (QSpiders) కంపెనీ ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలో తొమ్మిది మంది విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థినుల కు మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు, అనంతరం వారి ప్రతిభను బట్టి వార్షికంగా రూ.3.5 లక్షల నుంచి రూ.9.5 లక్షల వరకు ప్యాకేజీలతో ఉద్యోగాల్లో నియమించనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మలినేని పెరుమాళ్లు మాట్లాడుతూ విద్యార్థినులు ఉద్యోగాలు సాధించడం కళాశాలకు గర్వకారణమని అన్నారు. డైరెక్టర్ డాక్టర్ గోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ ఇది నాలుగో క్యాంపస్ ఇంటర్వ్యూ అని, ఇప్పటి వరకు మొత్తం 39 మంది విద్యార్థినులు ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ కళాశాల విద్యార్థినుల ప్రతిభకు ఇది నిదర్శనమని కొనియాడారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ స్రవంతి ఇంటర్వ్యూ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సీఎస్సీ హెచ్‌ఓడీ జ్యోతి, ఎస్ అండ్ హెచ్ హెచ్‌ఓడీ వసుమతి, ఏవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# 47 మద్యం బాటిళ్ల ధ్వంసం

**సింగరాయకొండ,జనవరి 29,ప్రభాత వార్త**



ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నమోదైన అక్రమ మద్యం కేసులకు సంబంధించిన 47 మద్యం బాటిళ్లను ఎక్సైజ్ అధికారులు ధ్వంసం చేశారు. గురువారం సాయంత్రం సింగరాయకొండ ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో ఈ ధ్వంసం కార్యక్రమం నిర్వహించారు. ఒంగోలు ఎక్సైజ్ అధికారుల ఉత్తర్వుల మేరకు ఈ కార్యక్రమాన్ని ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ సూపరింటెండెంట్ అయేషా బేగం, ఏఈసీ వెంకట్ సమక్షంలో మొత్తం ఏడు కేసులకు సంబంధించిన 180 ఎంఎల్ సామర్థం గల 47 మద్యం బాటిళ్లను మధ్యవర్తుల సమక్షంలో నిబంధనల ప్రకారం ధ్వంసం చేసినట్లు అధికారులు తెలిపారు. అక్రమ మద్యం విక్రయాలు, తరలింపును అరికట్టేందుకు కఠిన చర్యలు కొనసాగిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ ఎం. శివకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

# పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి



**తాళ్లూరు,జనవరి 29, ప్రభాతవార్త**

ప్రభుత్వ ఆదేశాల మేరకుపెండింగ్ లో ఉన్న గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ పీ.శ్రీనివాసప్రసాదు సూచించారు. గురువారం తాళ్లూరులో నిర్మాణంలో ఉన్న గృహాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారులు ఆదేశాలను అనుసరించి ఉగాది నాటికి పెండింగ్ లో ఉన్న గృహ నిర్మాణాలను పూర్తి చేయాల్సిందిగా సూచించారు. ఎన్టీఆర్, పీఎంఏసీ పథకాల కింద నిర్మిస్తున్న అసంపూర్తిగా పక్కా గృహాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట గృహ నిర్మాణశాఖ ఏఈ హనుమంతరావు, వర్క్ ఇన్స్పెక్టర్ రవికుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ప్రశాంతి, లక్ష్మీ ప్రసన్న, డీఈఓ సుబ్బారావు ఉన్నారు.

# సోలార్‌తో విద్యుత్ ఆదా చేయండి - ఎమ్మెల్యే

**కందుకూరు జనవరి 30, ప్రభాతవార్త**



సోలార్ వినియోగంతో విద్యుత్ ఆదా చేయాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గృహ యజమానులకు సూచించారు. గురువారం ఆయన పట్టణంలోని కోటేశ్వర థియేటర్ సమీపంలో సుదర్శి సోలార్ సిస్టమ్స్ ఆఫీసును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ వినియోగం వలన కలిగే లాభాలును వివరించారు. భవిష్యత్తులో సోలార్ వినియోగం పెరుగుతుందని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఇళ్లపై సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రోత్సహిస్తున్నారని ఎమ్మెల్యే నాగేశ్వరరావు అన్నారు. అదేవిధంగా ఓగూరు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన గొట్టిపాటి కిచెన్ గార్డెన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు డైరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, టిడిపి పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సుదర్శి శ్యామ్ ప్రసాద్, నాయకులు ఉప్పుటూరి శ్రీనివాసరావు, చదలవాడ కొండయ్య, రాయపాటి శ్రీనివాసరావు, పాలేటి కోటేశ్వరరావు, చనమాల శ్రీధర్, చిలకపాటి మధుబాబు, పోకూరి రాంబాబు, అల్లం వెంకటేశ్వర్లు మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.

## కనిగిరిలో డ్రైనేజీ పనుల పరిశీలన - అభివృద్ధియే లక్ష్యం

### - మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్



**కనిగిరి, జనవరి 29, ప్రభాతవార్త**

పట్టణ అభివృద్ధి కోసం మౌలిక వసతుల విస్తరణే ప్రధాన లక్ష్యమని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ పేర్కొన్నారు. గురువారం కనిగిరి పట్టణంలోని కాశిరెడ్డి కాలనీ 11వ వార్డులో బీపీఎస్ అండ్ ఎల్ఆర్ఎస్ స్కీమ్ నిధుల ద్వారా రూ.14 లక్షల వ్యయంతో చేపట్టిన డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలో సక్రమమైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుతో పారిశుధ్యం మెరుగుపడి ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కలుగుతుందని అన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి సహకారం అందిస్తున్నారని తెలిపారు. డ్రైనేజీ నిర్మాణ బాధ్యతలు చేపట్టిన కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో కాంట్రాక్టర్ మన్సూర్, సచివాలయం అమీనిటీస్ సెక్రటరీ శంశీర్, షరీఫ్ ఉద్దిన్, మున్సిపల్ సిబ్బంది, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల లడ్డూ కల్తీకి నిరసనగా కనిగిరిలో సంప్రోక్షణ

### - హిందూ మత విశ్వాసాలపై దాడి చేసిన నాటి వైసీపీ పాలనను ఖండించిన కూటమి శ్రేణులు





**కనిగిరి, జనవరి 29, ప్రభాతవార్త**

వైసీపీ పాలనలో తిరుమల శ్రీ వారి లడ్డూలో జరిగిన కల్తీ ఘటన హిందూ మత విశ్వాసాలను తీవ్రంగా దెబ్బతీసిందని ఖండిస్తూ, గురువారం కనిగిరి కొత్తూరు అభయాంజనేయస్వామి దేవస్థానంలో ఆలయ శుద్ధి, వారు మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆధ్వర్యంలో షిట్ దర్యాప్తులో నెయ్యి కల్తీ జరిగిందని, అదే నెయ్యితో శ్రీవారి లడ్డూలు తయారు చేసినట్లు బయటపడిందన్నారు. వైసీపీ పాలనలో టీటీడీ నిబంధనలను సడలించి తిరుమల పవిత్రతను భంగం చేశారని విమర్శించారు. ఇప్పటికైనా కల్తీకి బాధ్యులు తమ తప్పు ఒప్పుకుని శ్రీవారిని క్షమాపణ కోరాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు రాచమల్ల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి తమ్మినేని వెంకటరెడ్డి, ఖాజా రెహ్మాన్,మాజీ కౌన్సిలర్ బుల్లా బాలబాబు,గంగవరపు నాగిరెడ్డి, వెన్న శ్రీనివాసులు,మస్తాన్‌బాబు, గడ్డం కోటేశ్వరరావు, మునగా బాలిరెడ్డి, జకరయ్య,పెన్నా వెంకటేశ్వర్లు, ఏఎంసీ డైరక్టర్ శ్రీనివాసులు,వాజీద, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 226 రోజుల తర్వాత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి బెయిల్ - న్యాయమే గెలిచింది

### - కటికల వెంకటరత్నం



**కనిగిరి, జనవరి 29, ప్రభాతవార్త**

ఒంగోలు పార్లమెంటరీ వైసీపీ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి కోర్టు బెయిల్ మంజూరు చేయడంపై వైసీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి కటికల వెంకటరత్నం గురువారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధారాలు లేని కేసులో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి 226 రోజుల పాటు అక్రమంగా నిర్బంధించారని ఆరోపించారు. ఇది రాజకీయ కక్ష సాధింపేనని, ఈ వ్యవహారంలో కూటమి ప్రభుత్వం వ్యవహాఇంచిన తీరు బాధాకరమని విమర్శించారు. చివరకు కోర్టులో న్యాయం గెలిచిందని, నిజం బయటపడిందని అన్నారు. ఈ పరిణామంపై పార్టీ శ్రేణుల్లో ఆనంద వాతావరణం నెలకొన్నట్లు తెలిపారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వైసీపీ శ్రేణులు వెనుకడుగు వేయవని, రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసేందుకు కట్టుబడి పని చేస్తామని కటికల వెంకటరత్నం పేర్కొన్నారు.

## అమరావతిలో స్వచ్ఛాంధ్ర డైరెక్టర్లకు శిక్షణ



**అద్దంకి, జనవరి 29, ప్రభాతవార్త**

అమరావతిలో స్వచ్ఛఆంధ్రప్రదేశ్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో ఆ సంస్థ డైరెక్టర్‌లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్ట వలసిన అభివృద్ధికార్యక్రమాలపై వారికి అవగాహన కలిగించారు. 103.05కోట్లతో అభివృద్ధి కార్యక్రమాల విషయంలో సిబి,ఐఇసి, శిక్షణను వీరికి అధికారులు ఇచ్చారు. ఈ సమావేశంలో కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్‌తోపాటు అద్దంకికి చెందిన డైరెక్టర్ చిన్ని లక్ష్మీశ్రీనివాసరావుతోపాటు పలువురు డైరెక్టర్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## క్యాంపస్‌కు ఎంపికైన 26 మంది హర్షిణి విద్యార్థులు



**అద్దంకి , జనవరి 29, ప్రభాతవార్త**

ఒంగోలులోని శ్రీహర్షిణి డిగ్రీ కళాశాలలో జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో అద్దంకి శ్రీహర్షిణి కళాశాలకు చెందిన 26మంది విద్యార్థులు ఎంపిక అయ్యారు. వీరికి ఒక్కొక్కరికి ఏడాదికి 2.5 నుండి 3.5లక్షలు వార్షిక ప్యాకేజి ఇవ్వరున్నారు. ఈ క్యాంపస్ ఎంపికకు ఫోక్స్‌కాన్,టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీలు, హాజరు అయ్యాయి. వీరింతా ఫిబ్రవరి 1వ తేదిన బెంగులూరులోని ఆయా కంపెనీలలో ఉద్యోగాలలో చేరనున్నారు.

## ఉత్తమ తహశీల్దార్‌కు సత్కారం



**అద్దంకి , జనవరి 29,ప్రభాతవార్త**

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ అధికారిగా అవార్డు పొందిన అద్దంకి తహశీల్దార్ శ్రీచరణ్‌ను గురువారం అద్దంకి కార్యాలయంలో ఐక్యవేదిక కార్యవర్గసభ్యులు ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక అధ్యక్షులు జ్యోతి రమేష్‌బాబు,ట్రెజరర్ చెన్నుపల్లి నాగేశ్వరరావు, ఆర్టిసి రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు వసుమర్తి చిన్న కోటయ్య, ఐక్యవేదిక సభ్యులు జ్యోతి డేవిడ్, కంకణాల రవిబాబు, ప్రకాశం జిల్లా అధ్యక్షులు తెలగతోటి రాధాకృష్ణమూర్తి, ఏ ఎస్ ఓ అమర్నాథ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## లెబర్ కోడ్ బిల్లు రద్దు చేయాలి



**అద్దంకి , జనవరి 29, ప్రభాతవార్త**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లెబర్ కోడ్ బిల్లును రద్దు చేయాలని ఫిబ్రవరి 12న సి.ఐ.టి.యు. కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశ వ్యాప్త సమ్మె జరగనున్నది. ఈసమ్మెలో పాల్గొన్ని విజయవంతం చేయాలని గురువారం అద్దంకిలోని సివిల్‌సప్లైయిస్ ముఠా కార్మికులకు తంగిరాలవెంకటేశ్వర్లు అవగాహన కలిగించారు.

## జాతీయ క్రీడలలో సత్తా చాటిన మోడల్ స్కూల్ విద్యార్థినీ



**ముండ్లమూరు, జనవరి 29, ప్రభాతవార్త**

ఇటీవల రాజస్థాన్‌లో అజ్మీర్‌లో క్రికెట్ స్టేడియంలో జరిగిన జాతీయ క్రీడలలో ముండ్లమూరులో ఉన్న మోడల్ స్కూల్ విద్యార్థినీ, తమ్మినేని సింధు అండర్ 14 జాతీయ ఖోఖో క్రీడలో తమ సత్తా చాటి మెడల్ సాధించి స్కూల్‌లో ప్రధానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినీ తల్లిదండ్రులు రంగనాథ్, రమణ తమ కూతురు సాధించిన విజయాన్ని గర్వంగా ఉందని ఇలాంటి క్రీడలలో మా కుమార్తెకు సహకరించిన ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు శివారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులందరూ తమ సహాయ సహకారాలను అందించారన్నారు. పాఠశాల హెడ్ మాస్టర్ మాట్లాడుతూ మా స్కూల్ విద్యార్థులు క్రీడలలో, చదువులోనూ ముందు ఉంటారని, దీని కోసం టీచర్స్ భాగా కష్టపడతారని తెలిపారు.

## విధానాలు మార్చుకోకపోతే పదకొండు ఒకటవుతుంది

### - కందుల రామిరెడ్డి హెచ్చరిక

### - లడ్డూ కల్తీపై ఆధ్యాత్మిక నిరసన - గర్భగుడి శుద్ధి



**మార్కాపురం, జనవరి 29, ప్రభాతవార్త**

తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీ వారి లడ్డు తయారీలో ఉపయోగించే నెయ్యిలో కల్తీ జరిగిందని ఆరోపిస్తూ గురువారం మార్కాపురంలోని లక్ష్మి చెన్నకేశవ స్వామి దేవస్థానంలో కూటమి నేతలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసనలో టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొనగా, కార్యక్రమానికి టీడీపీ నాయకులు కందుల రామిరెడ్డి ఆధ్వర్యం వహించారు. గత ప్రభుత్వ హయాంలోనే ఈ కల్తీ జరిగినట్టు ఆరోపిస్తూ, దీనికి నిరసనగా దేవస్థానంలోని గర్భగుడిని పవిత్ర జలాలతో శుద్ధి చేసి ఆధ్యాత్మిక నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కందుల రామిరెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణలో నెయ్యిలో కల్తీ జరిగినట్టు నిగ్గు తేలిందని అన్నారు.జగన్ ప్రభుత్వం ఇప్పటికైనా తన విధానాన్ని మార్చుకోకపోతే భవిష్యత్తులో మరింత తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. దేవదేవుని ఆగ్రహానికి గురైన కారణంగానే గత ఎన్నికల్లో 151 సీట్లు గెలిచిన వైసీపీ 11 సీట్లకే పరిమితమైందనివ్యాఖ్యానించారు. ఇదే తీరును కొనసాగిస్తే భవిష్యత్తులోనూ ఇదే పరిస్థితి ఎదురవుతుందని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఆరాధ్య దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ప్రసాదమైన లడ్డూలో కల్తీ చేయడం మహా పాపమని, దీనికి తగిన పర్యవసానం తప్పక ఎదుర్కోవాల్సి వస్తుందని కందుల రామిరెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ, బీజేపీ నాయకులు శాసనాల సరోజినీ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దర్శి సెంటర్లో ఫ్లెక్సీల రగడ

### - వైసీపీ నాయకులు అరెస్టు విడుదల



**దర్శి, జనవరి 29, ప్రభాతవార్త**

దర్శి గడియారస్తంభం సెంటర్లో గురువారం మధ్యాహ్నం కొందరు మహా పాపం నిజం అను నినాదంతో కలిగిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డిల ఫోటోలతో ఉన్నటువంటి కల్తీ నెయ్యి విషయం అయ్యే ఫ్లెక్సీని ఏర్పాటు చేయగా స్థానిక వైసీపీ నాయకులు గడియారస్తంభం సెంటర్‌కి చేరుకుని ఫ్లెక్సీ ఏర్పాటు పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తుండగా కొద్దిసేపు ట్రాఫిక్ కి వాహనాలు నిలిచిపోగా ఫ్లెక్సీని వైసీపీ నాయకులు తొలగించడంతో పాటు నిప్పంటించి కాల్చి వేయడం వెంటనే సమాచారం తెలుసుకున్న ఎస్సై ఎం.మురళి సంఘటన స్థలానికి చేరుకుని ఫ్లెక్సీ తొలగించి నిప్పంటించిన వారిని వైసీపీ నాయకుల్ని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేయగా కొద్దిసేపు పోలీసులకి, వైసీపీ నాయకులకు వాగ్వాదం జరిగింది. ఎస్సై వారిని పోలీసు స్టేషన్‌కు తరలించడం జరిగింది. సాయంత్రం అరెస్టు చేసిన వైసీపీ నాయకుల్ని విడుదల చేయడం జరిగింది. మరలా సాయంత్రం సమయంలో టీడీపీ నాయకులు గడియారస్తంభం సెంటర్లో వివాదం జరిగిన ఫ్లెక్సీలనే రెండు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం జరిగింది.

## ఫిబ్రవరి 12న దేశ వ్యాప్త సమ్మె జయప్రదం చేయండి

### - సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు తాండవ రంగారావు



**దర్శి, జనవరి 29, ప్రభాతవార్త**

కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఉద్యోగ, కార్మికులకు నష్టమైన 4 లేబర్ కోడ్స్‌కి వ్యతిరేకంగా 13 కేంద్ర కార్మిక సంఘాలు సంయుక్తంగా ఫిబ్రవరి 12న దేశ వ్యాప్త సమ్మె చేస్తున్నాయని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు తాండవ రంగారావు అన్నారు. గురువారం సుందరయ్య భవనంలో మండలనాయకులు ఉప్పు నారాయణ అధ్యక్షతన జరిగిన దర్శి మండల సీఐటీయు కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమ్మెని దర్శి నియోజకవర్గంలో కార్మికులు, ఉద్యోగులు జయప్రదం చేయాలని అన్నారు. 4 లేబర్ కోడ్స్ రద్దు చేసే వరకు సీఐటీయు పోరాడుతుందని అన్నారు. సీఐటీయు నాయకులు గుంటు బాల గురవయ్య, గర్నిపూడి జాన్ సామ్యేల్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు ఇత్తడి కోటయ్య, యోహోషువా, ఆదినారాయణ, షేక్ భాషా, యలమందారెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

## కోటి యాభై ఏడు లక్షల 46 వేలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

### - దర్శిలో డ్రైనేజీ సమస్యకి పరిష్కారం

### - దర్శిని అభివృద్ధి దిశగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం

### - టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ లలిత్‌సాగర్



**దర్శి, జనవరి 29, ప్రభాతవార్త**

దర్శిలో అభివృద్ధి కార్యక్రమాలకి గురువారం శంకుస్థాపన చేసిన దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ లలిత్ సాగర్ మొదట ముఖ్యంగా దర్శిలో డ్రైనేజీ సమస్య ఎన్నో సంవత్సరాలుగా ఉందని ఈ మధ్య కురిసిన వర్షాలకు కూడా రోడ్డంతా బ్లాక్ అయి ప్రజలకు ఇబ్బందిగా ఉండడంతో కురిచేడు అటు వైపు రోడ్డు నుండి డ్రైన్ అంతా కనెక్ట్ అయ్యి చింతలపాలెం వరకు వెళ్లేటట్లుగా 55 లక్షల 46000 గాను శాంక్షన్ చేసి తర్వాత 30 లక్షలకు గాను ఆ తర్వాత ఉన్న వైపు కాలువ డామేజ్ అవడంతో అది కూడా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి అభివృద్ధి అనే జెండాతో ముందుకు వెళ్తున్నామని గొట్టిపాటి లక్ష్మీ సాగర్ అన్నారు. అనంతరం మాట్లాడుతూ ఎక్కడ ప్రజలకి ఇబ్బంది లేకుండా సంక్షేమం అందరికి ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ఎలాంటి కక్ష సాధింపులు ఉండకూడదు, విధ్వంసం ఉండకూడదు అనే నినాదంతో ముందుకు వెళ్తున్నామని మండల విద్యాశాఖ కార్యాలయం నూతన భవనాన్ని 55 లక్షల రూపాయలతో శంకుస్థాపన ఇప్పుడు చేయటం జరిగిందని, అనంతరం ఎనిమిదో వార్డులో డ్రైనేజీ సైడు కాలువలు 42 లక్షలతో శంకుస్థాపన కార్యక్రమం చేపట్టామని, పార్టీలు అనేవి ఎన్నికల సమయంలో మాత్రమేనని, అందరూ సంతోషంగా ఉండాలని మా నాయకుడు చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్, లోకేష్‌లు నాయకత్వంలో ముందుకు వెళ్తున్నామని కానీ వైసీపీ ప్రభుత్వంలో ఐదు సంవత్సరాల విధ్వంసం ఇంకా గొడవలు సృష్టిస్తున్నారని, వైసీపీ వారికి 11 సీట్లు ఇచ్చి ఇంట్లో కూర్చోబెట్టిన కూడా వాళ్ళలో మార్పు రాకుండా ఇంకా విధ్వంసం సృష్టిస్తున్నారన్నారు. తిరుపతి లడ్డు విషయంలో క్లియర్‌గా సుప్రీం కోర్టు షీట్ కల్తీ నెయ్యి ఉందని నాసిరకం పదార్థాలు కూడా కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి సన్నిధిలో అపవిత్రమైన సరుకులు కలవడం దారుణం దీనికి వారు క్షమాపణ చెప్పాలన్నారు. మా అది నాయకుడు కూటమి ప్రభుత్వం హయాంలో అభివృద్ధి చేయాలని చెప్పారని విధ్వంసం సృష్టించమని చెప్పలేదు అని అన్నారు. అదే విధంగా దర్శి నియోజకవర్గంలో గతంలో పది ప్రాజెక్టులు ఆగిపోయాయని వాటిని పూర్తి చేయడమే మా లక్ష్యంగా దర్శిని దిశగా మార్చాలని లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, మున్సిపాలిటీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు, మండల విద్యాశాఖ అధికారులు మాలకొండయ్య, రమాదేవి, పలువురు టీడీపీ నాయకులు, ఉపాధ్యాయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భాష్యం స్కూల్లో అగ్ని ప్రమాదాలపై అవగాహన



**దర్శి, జనవరి 29, ప్రభాతవార్త**

భాష్యం పాఠశాల సిబ్బంది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్ని మాపక సేవల శాఖ వారిని ఆహ్వానించడం జరిగింది. దర్శి బ్రాంచ్ విద్యార్థినీ,విద్యార్థులకు గురువారం అగ్ని ప్రమాదాలు, ఎలక్ట్రిక్ కరెంట్ షార్ట్‌సర్క్యూట్, అపార్టుమెంట్స్‌లో, డిమెస్టిక్ గ్యాస్ వల్ల ఇంటిలో జరిగే అగ్ని ప్రమాదాలు ఎలా సంభవిస్తాయి అని సంభవించినప్పుడు మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్ని ప్రమాదాలకు గురైన వారిని ఎలా రక్షించాలో, అగ్ని ప్రమాదాలను అరికట్టే విధానం కన్నులకు కట్టినట్లు ప్రదర్శించి చూపించడం జరిగింది. విద్యార్థినీ, విద్యార్థులు ఎంతో ఆసక్తితో నేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ జాలయ్య, ఆంజనేయులు, సురేంద్రబాబు, యేసు బాబు, మీరావలి, బ్రహ్మయ్య, ప్రిన్సిపాల్ జగదీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా సుబ్రమణ్యేశ్వరస్వామి శాంతి కళ్యాణం







**బల్లికురవ, జనవరి 29, ప్రభతవార్త**

భీష్మ ఏకాదశి పర్వదిన సందర్భంగా మండలంలోనికొణిదెన గ్రామంలోని బ్రహ్మగుండం పుణ్యక్షేత్రం వద్ద వేంచేసియున్న వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి గురువారం ఘనంగా శాంతికళ్యాణ మహోత్సవం నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో ఈ సందర్భంగా గణపతి పూజ, కలశారాధన శాంతి కళ్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి విగ్రహాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి శాంతి కళ్యాణం నిర్వహించడం ద్వారా భక్తులకు శుభాలు, సంతానం, ఆటంకాల నివారణ, శ్రేయస్సును కలిగిస్తుందని వేద పండితులు వివరించారు. స్వామి వారి కళ్యాణ మహోత్సవం విశ్వశక్తుల ఐక్యతకు కూడా ప్రతీక అన్నారు. అవివాహితులు ఈ కళ్యాణం చూస్తే వారికి వివాహం, సంతాన భాగ్యం కలుగుతుందనేది అనాదిగా వస్తున్న భక్తుల విశ్వాసం అన్నారు. ఈ కళ్యాణాన్ని వీక్షించడం ద్వారా సర్ప దోషం, కుజదోషం, తగ్గించడంతో పాటు, సంపద శాంతి, శ్రేయస్సు, విద్యా సంబంధాలలో విజయాలు చేకూరుతాయని వివరించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా శాంతి కళ్యాణాన్ని పేర్కొన్నారు.ఈ సందర్భంగా చిన్నారులచే భరతనాట్య ప్రదర్శన కొనసాగింది. కళ్యాణ మహోత్సవంలో కొనిదెన, గంగపాలెం, రాజుపాలెం,గ్రామాల ప్రజలు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## ప్రసన్నాంజనేయస్వామి ముఖమండపానికి విరాళం



**అద్దంకి, జనవరి 29,ప్రభాతవార్త**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామివారి దేవస్థానంలో గురువారం భీష్మ ఏకాదశి సందర్భంగా స్వామివారికి పూజలు నిర్వహించారు. విజయవాడ వాస్తవ్యులు చిన్ని కామేశ్వరరావు, ధర్మపత్ని పూర్ణావతి రాతి ముఖ మండపానికి , గాలిగోపురాలు నిర్మాణానికి రు. 1,11,116 రూపాయలు పాలకమండలి అధ్యక్షులు చుండూరు మురళీ సుధాకర్ రావుకి అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు కోనంకి సుబ్బారావు పాల్గొన్నారు. దాతలకు పూజా కార్యక్రమాలు తదనంతరం స్వామివారి శేష వస్త్రము, ఫోటో తీర్థప్రసాదములు ఇచ్చి అర్చకులు అశీర్వచనాలు అందజేశారు.

## రోటరీ ఆధ్వర్యంలో నైపుణ్యం కలిగిన వారికి సత్కారం



**అద్దంకి ,జనవరి 29,ప్రభాతవార్త**

రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి ఆధ్వర్యంలో సీనియర్ రొటేరియన్ కాకాని రాధాకృష్ణమూర్తి సౌజన్యంతో వృత్తి నైపుణ్య అవార్డ్సు పంపిణీ కార్యక్రమం స్థానిక గీతా మందిరంలో ఘనంగా జరిగింది. వివవిధ వృత్తులలో నైపుణ్యం కలిగిన వారిని ఎంపిక చేసి 10 మందిని శాలువాతోసత్కరించి జ్ఞాపిక,అవార్డ్సు ప్రదానం చేశారు.నైపుణ్య అవార్డు పొందిన వారు. ఆరుద్ర శ్రీనివాసరావు, ట్రాఫిక్ కానిస్టేబుల్, ఆర్య సుమలత నర్స్, కొండముది ఆంజనేయులు, టివి మెకానిక్, నన్నెబోయిన అశోక్ బాబు,ఆర్‌టిసి డ్రైవర్, పొన్నపల్లి మల్లిఖార్జున రావు వడ్రంగి, గుండెమెడ వెంకట సుబ్బారావు, ఎలక్ట్రీషియన్, భీమి శెట్టి శ్రీనివాసరావు, తాపీ మేస్త్రీ, పటాన్ ఫజు లుల్లాఖాన్ స్వర్ణకారుడు, మార్టూరు శ్రీనివాసరావు, నాయిబ్రహ్మణ, ధర్మవరపు బాబురావు టైలర్‌లు వున్నారు. ఈ కార్యక్రమంలో సి.ఐ. సుబ్బరాజు, అధ్యక్షులు పూర్ణచంద్రరావు, కార్యదర్శి అళహరి హరిప్రసాద్, తమ్మన శ్రీనివాసరావు,కాకాని రాధకృష్ణమూర్తి, సందిరెడ్డి శ్రీనివాసరావు, బివి కృష్ణారెడ్డి డాక్టర్ దేవపాలన, నరసింహారావు,చప్పిడి వీరయ్య,రఫీ,పి.రామకోటేశ్వరరావు, ఊటుకూరి రామకోటేశ్వరరావు, చిన్ని మురళీకృష్ణ, లేవి ప్రసాద్, ఆంజనేయులు, సుబ్బారావు, భువనేశ్వరి, యర్రమోతు రమేష్, కె.వెంకటేశ్వర్లు, అంజాద్‌బాషా తదితరులు వున్నారు.

## బాధితురాలికి అండగా మంత్రి గొట్టిపాటి

### - సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



**అద్దంకి,జనవరి 29, ప్రభాతవార్త**

అనారోగ్యంతో బాధపడుతూ శస్త్రచికిత్స చేయించుకున్న మణికేశ్వరం గ్రామానికి చెందిన మూకిటి వెంకట శేషమ్మకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచింది. రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక చొరవతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షుడు, గ్రామ నేత షేక్ కరిముల్లా బాధిత కుటుంబానికి అందజేశారు.ఈ సందర్భంగా షేక్ కరిముల్లా మాట్లాడుతూ, పేద ప్రజల ఆరోగ్యం పట్ల మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఎల్లప్పుడూ ప్రత్యేక శ్రద్ధ వహిస్తారని కొనియాడారు. శస్త్రచికిత్స నిమిత్తం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వెంకట శేషమ్మ పరిస్థితిని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన తక్షణమే స్పందించి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించారని తెలిపారు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడంలో తమ నాయకుడు గొట్టిపాటి ఎప్పుడూ ముందుంటారని ఆయన పేర్కొన్నారు. తమ కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన మంత్రికు బాధితురాలు, వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామపార్టీ నాయకులు అశోక్, ఆదినారాయణ,మాధ్యూస్, మోలాలి,బలరామిరెడ్డి,రవి , అబ్దుల్లా, ఫకీర్,మరియు ఇతర ముఖ్య నాయకులు, పాల్గొన్నారు.

## డేటా ఇంజనీరింగ్ పై వర్క్ షాపు

**వేటపాలెం, జనవరి 29, ప్రభాతవార్త**

స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో డేటా ఇంజనీరింగ్‌పై నిర్వహిస్తున్న ఎండు రోజుల వర్క్‌షాపు గురువారం చూసిందని సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, కళాశాల కార్యదర్శి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. డేటా ఇంజనీరింగ్ పై రెండు రోజుల వర్క్‌షాపును డేటా సైన్స్ విభాగంలో రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఈ వర్క్‌షాపు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.జగదీష్‌బాబు తెలిపారు. ఈ వర్క్‌షాపులో ఐడియాజెన్ టెక్నాలజీస్, తిరుపతి వారి సహకారంతో నిర్వహించినట్లు ఆయనతెలిపారు. ఈ వర్క్ షాపులో డేటా ఇంజనీరింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారని తెలిపారు. ఈ వర్క్ షాపుకు రిసోర్సు పర్సన్‌గా కే.సిరి చందన, ప్రాజెక్టు అసోసియేట్ ఐఐటీ మద్రాస్ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహారించారని డేటా సైన్స్ విభాగాధిపతి డాక్టర్ కే.సుబ్బారవు తెలిపారు. విద్యార్థులకు డేటా ఇంజనీరింగ్‌పై అవగాహన కల్పించి, దానికి సంబంధించిన టూల్స్‌ను వివరంగా నేర్పి వాటిపై ప్రయోగాలను నిర్వహించినట్లు తెలిపారు. డేటా ఇంజనీరింగ్ పై అవగాహన పెంపొందించుకుని నేర్చుకోవడం వలన డెసిషన్ మేకింగ్‌ను సమర్థవంతంగా నిర్వహించి సరైన సూచనలు, చర్యలను చేపట్టినట్లయితే కంపెనీలను సమర్ధవంతంగా నిర్వహించవచ్చని తెలిపారు. తద్వారా వారి ఉద్యోగ అవకాశాలు పెరుగతాయని బీటెక్ విద్యార్థులు ఈ వర్క్ షాపుకు హాజరవ్వడం ఎంతో ఉపయోగకరమైందని, వారి ఉద్యోగ అవకాశాలు మెరుగు పడటానికి ఈ వర్క్‌సాపు దోహదపడుతుందని డేటా సైన్స్ విభాగాధిపతి తెలిపారు.

## కార్పెంటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆర్థిక సాయం

### - ప్రమాదంలో గాయపడిన కార్పెంటర్



**చీరాల,జనవరి 29, ప్రభాతవార్త**

ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కార్పెంటర్ కుటుంబానికి వేటపాలెం కార్పెంటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అండగా నిలిచింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి గత ఎనిమిది నెలలుగా పూర్తి విశ్రాంతి తీసుకుంటున్న కార్పెంటర్ సాతా శ్రీను కుటుంబాన్ని గురువారం పలువురు కార్పెంటర్లు కలిసి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు తక్షణ సాయం కింద వెల్ఫేర్ అసోసియేషన్ తరుపున పదిహేడు వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. సీనియర్ కార్పెంటర్ సోమన హనుమంతరావు మాట్లాడుతూ ప్రమాదంలో రెండు కాళ్లు విరిగి పూర్తి విశ్రాంతిలో ఉన్న శ్రీను కుటుంబం ఆర్థిక పరిస్థితులు తెలిసి వేటపాలెంలోని కార్పెంటర్స్ అందరూ స్పందించి ఆర్థిక సహాయం చేయటం కార్పెంటర్ల ఐకమత్యానికి నిదర్శనం అన్నారు. భవిష్యత్తులో ఎటువంటి సమస్యలు ఎదురైనా సమిష్టిగా ఎదుర్కొని వృత్తి సమస్యలను పరిష్కరించేందుకు కలిసి ఆవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీను కుటుంబ సభ్యులు, సీనియర్ కార్పెంటర్లు గాదె శ్రీను, ఎన్.భగవాన్‌రెడ్డి, జి.సుభాని, కోనేటి రజనీకాంత్, పసుపులేటి ప్రసాద్, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

